క్లుప్తంగా

సీసీ కెమెరాల ధ్వంసంపై విచారణ

గుత్తి: పట్టణంలోని అమృత్ సినిమా థియేటర్, సీఎస్ఐ చర్చి రోడ్డులోని నాయక్ మొబైల్ సెంటర్‌లో నాలుగు రోజుల క్రితం రెండు సార్లు సీసీ కెమెరాలను ధ్వంసం చేశారు. ఎస్సీ కాలనీకి చెందిన సాయి అనే యువకుడు నాయక్ మొబైల్ షాపు నిర్వాహకుడు వెంకటేష్ నాయక్‌పై దాడి చేయడంతోపాటు సీసీ కెమెరాలను ధ్వంసం చేసినట్లు బాధితులు వెంకటేష్ నాయక్, దాదా ఖలందర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. హెడ్ కానిస్టేబుళ్లు రమేష్ నాయక్, ప్రకాశం సోమవారం ఘటన స్థలాలకు చేరుకుని విచారణ చేపట్టారు.

తాగునీటి బోర్లు ప్రారంభం

గుత్తి: మున్సిపాలిటీ పరిధిలోని 22, 23వ వార్డుల్లో సోమవారం తాగునీటి పరిష్కారానికి మున్సిపల్ పాలక వర్గం, అధికారులు చర్యలు తీసుకున్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నూర్ బీ, కమిషనర్ శరత్‌చంద్ర ఆధ్వర్యంలో వాటర్ వర్క్స్ సిబ్బంది 22, 23వ వార్డుల్లో బోర్లు ఏర్పాటు చేసి మోటార్లు బిగించారు. బోర్లు ఏర్పాటు చేయడంతో రెండు వార్డుల్లో నీటి సమస్య దాదాపు పరిష్కారం అయినట్లే. కౌన్సిలర్ సులోచన, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ పీరా, పట్టణ సచివాలయ కన్వీనర్ రంగస్వామి, షఫీ, మహమ్మద్ పాల్గొన్నారు.

'పోషణ్ పక్వాడా' ప్రారంభం

గుత్తి: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో సోమవారం పోషణ్ పక్వాడా కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నూర్‌బీ, సీడీపీఓ నాగమణి, ఏసీడీపీఓ డిల్లీశ్వరి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీడీపీఓ పోషణ్ పక్వాడా కార్యక్రమం గురించి వివరించారు. ఈ నెల 20 నుంచి ఏప్రిల్ 1 వరకు కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. సూపర్‌వైజర్లు నాగేశ్వరి, ప్రియాంక, కృష్ణవేణి పాల్గొన్నారు.

శ్రీవారి సన్నిధిలో తిమ్మాపురం గ్రామస్తుల భజన


భజన చేస్తున్న భజన బృందం సభ్యులు

గుంతకల్లు రూరల్: తిమ్మాపురం గ్రామానికి చెందిన భజన బృందం సభ్యులు సోమవారం తిరుమల శ్రీవారి సన్నిధిలోని భజన చేశారు. శ్రీవారి సేవలో భాగంగా తిరుమలకు చేరిన భజన బృందం సభ్యులు నాగపుల్లయ్య, నాగరాజు, అంజి, పుల్లయ్య, లేపాక్షి, ఓబులేసు, ఆదిశేషయ్య, రాజశేఖర్, రామంజులు, రఫి, శేషయ్య తదితరులు స్వామివారి సన్నిధిలోని అఖండ హరినామ సంకీర్తన నిలయంలో భజన నిర్వహించారు.

శ్మశానం కబ్జా కాకుండా కాపాడండి

యాడికి: మండల కేంద్రంలోని కోనరోడ్డులో ఉన్న శ్మశానం కబ్జా కాకుండా చూడాలని తహసీల్దార్ కార్యాలయంలో మే ఐ హెల్ప్‌యూ ఫౌండేషన్ సభ్యులు తహసీల్దార్ అలెగ్జాండర్ కోరారు. సోమవారం ఈ మేరకు వారు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్మశానం సమీపంలో ఉన్న కొంతమంది శ్మశాన స్థలాన్ని ఆక్రమించుకుంటున్నారన్నారు. ఫౌండేషన్ సభ్యులు బండారు బాలకృష్ణ, చంద్రశేఖర్ రెడ్డి, తిరుమలరెడ్డి, సాయికిరణ్, వెంకటరాముడు పాల్గొన్నారు.


పేకాటరాయుళ్ల అరెస్ట్

యాడికి: మండల కేంద్రంలో కోన రోడ్డులో సోమవారం రాత్రి ఆరుగురు పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు. వారి నుంచి రూ.8,500 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

చిరుధాన్యాల ప్రాముఖ్యత తెలుసుకోవాలి

గుంతకల్లు రూరల్: చిరుధాన్యాల ప్రాముఖ్యత అందరూ తెలుసుకోవాలని గౌతమి గ్రామైక్య సంఘం సభ్యులు పేర్కొన్నారు. చిరుధాన్యాల మాసోత్సవంలో భాగంగా సోమవారం పాత కొత్తచెరువులో గౌతమి గ్రామైక్య సంఘం ఆధ్వర్యంలో చిరుధాన్యాల ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

బాధితుడికి ఆర్థికసాయం


ఆర్థికసాయం చేస్తున్న ఫయాజ్ బాషా

తాడిపత్రి టౌన్ : స్థానిక పడమర గేరి ఐదవ నంబర్ బీడి పరిశ్రమలో సోమవారం తాడిపత్రి పట్టణానికి చెందిన పక్షవాత రోగి రామయ్యకు రూ.15 వేలు నగదును ఫయాజ్‌బాషా ట్రస్ట్ చైర్మన్ ఫయాజ్ బాషా అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. రామయ్య కొన్నేళ్లుగా పక్షవాతంతో బాధపడుతున్నాడు. ఆయన కుటుంబ ఆర్థిక పరిస్థితిని గుర్తించి తన వంతు సాయంగా ఆర్థికసాయం చేసినట్లు ఫయాజ్‌బాషా తెలిపారు. వక్ఫ్‌బోర్డు అధ్యక్షుడు షాషావలి, ఉపాధ్యక్షుడు మహబూబ్‌బాషా, నాయకులు రాజశేఖర్‌రెడ్డి, గురుప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నాళ్లో వేచిన ఉదయం..

- గుంతకల్లుకు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల
- కళాశాల ఏర్పాటుకు పరిపాలనా అనుమతులిస్తూ గెజిట్ విడుదల
- కళాశాల నిర్మాణం, మౌలిక వసతుల కల్పనకు రూ.34.74 కోట్ల మంజూరు
- మూడు కోర్సులకు అనుమతి
- మాట నిలబెట్టుకున్న ఎమ్మెల్యే వైవీఆర్



గుంతకల్లుటౌన్: గుంతకల్లు నియోజకవర్గ ప్రజల నాలుగు దశాబ్దాల నాటి కల సాకారం కానుంది. గుంతకల్లులో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వ సాంకేతిక విద్యాశాఖ పరిపాలనా అనుమతులిస్తూ సోమవారం గెజిట్ నోటిఫికేషన్(నెం.328)ను విడుదల చేసింది. కళాశాల నిర్మాణం, మౌలిక వసతుల కల్పనకు రూ.34.74 కోట్ల నిధులను మంజూరు చేస్తున్నట్లు పేర్కొంది. కళాశాలలో డిప్లొమా ఇన్ మెకానికల్ ఇంజనీరింగ్, డిప్లొమా ఇన్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, డిప్లొమా ఇన్ సివిల్ ఇంజనీరింగ్ కోర్సులకు అనుమతిచ్చింది. బోధన, బోధనేతర సిబ్బంది నియామకానికి త్వరలోనే ఉత్తర్వులు జారీ చేయనున్నట్లు ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ సౌరభ్ గౌర్ గెజిట్‌లో పేర్కొన్నారు.

నెరవేరిన ఎమ్మెల్యే వైవీఆర్ హామీ

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే గుంతకల్లులో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను ఏర్పాటు చేసి తీరుతామని ఎన్నికల్లో వై.వెంకటరామిరెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారు. ప్రజా సంకల్పయాత్రలో భాగంగా గుంతకల్లుకు విచ్చేసిన అప్పటి ప్రతిపక్ష నేత వైఎస్.జగన్‌మోహన్ రెడ్డిని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వై.వెంకటరామిరెడ్డి కోరగా ఆయన సానుకూలంగా స్పందించారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల కోసం విద్యార్థి, ప్రజా సంఘాలు కూడా నాలుగు దశాబ్దాలుగా అనేక పోరాటాలు చేసినా గత పాలకులెవ్వరూ పట్టించుకోలేదు. కానీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు కోసం చేసిన కృషి ఎట్టకేలకు ఫలించడంతో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థి సంఘాల నేతలు, నియోజకవర్గం ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

సీఎం జగన్‌కు కృతజ్ఞతలు



ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు గుంతకల్లులో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటుకు అనుమతులిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయించిన ఏపీ సీఎం జగన్‌మోహన్ రెడ్డికి గుంతకల్లు నియోజకవర్గం ప్రజలందరి తరఫున కృతజ్ఞతలు. సాంకేతిక, ఉన్నత విద్యాశాఖ మంత్రి, అధికారులకు ధన్యవాదాలు.

– ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి, గుంతకల్లు

గెజిట్ విడుదల సంతోషదాయకం

గుంతకల్లులో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ విడుదల చేయడం చాలా సంతోషదాయక విషయం. స్థానికంగా పాలిటెక్నిక్ కళాశాల లేని కారణంగా ఈ ప్రాంత విద్యార్థులు ఆదోని, బళ్లారి, అనంతపురం తదితర ప్రాంతాలకు వెళ్లి చదువుకునేవాళ్లు. ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న సీఎం జగన్, ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డిలకు కృతజ్ఞతలు. మాట ఇస్తే తప్పేది లేదని సీఎం జగన్, ఎమ్మెల్యే వైవీఆర్‌లు మరోసారి నిరూపించుకున్నారు.

– ఎన్.భవాని, మున్సిపల్ చైర్‌పర్సన్, గుంతకల్లు

పంట నష్టంపై ప్రభుత్వానికి నివేదిస్తాం


శింగనమలలో వరి పొలాన్ని పరిశీలిస్తున్న డీఏఓ చంద్రానాయక్

గార్లదిన్నె: గాలివాన, వడగండ్లతో దెబ్బతిన్న పంటల వివరాలు ప్రభుత్వానికి నివేదించి నష్టపరిహారం అందించేలా కృషి చేస్తామని అనంతపురం వ్యవసాయశాఖ ఏడీ వెంకటరాముడు పేర్కొన్నారు. సోమవారం మండలంలో అకాల వర్షానికి దెబ్బతిన్న పంటలను ఏడీఏ, తహసీల్దార్ ఉషారాణి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మొక్కజొన్న 43, వరి 35, వేరుశనగ 10 ఎకరాల్లో పంట నష్టం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఏఓ సోమశేఖర్, ఏఈఓ స్రవంతి, వీహెచ్‌ఏలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

శింగనమల/బుక్కరాయసముద్రం:వర్షాలు, ఈదురుగాలులకు దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం మంజూరు చేయించి రైతులను ఆదుకుంటామని జిల్లా వ్యవసాయ అధికారి (డీఏఓ) చంద్రానాయక్ తెలిపారు. శింగనమల చెరువు కింద సాగైన వరి, మొక్కజొన్న పంటలు వర్షాలకు పూర్తిగా దెబ్బతిన్నాయి. సోమవారం డీసీఎంఎస్ డైరెక్టర్ శ్రీరామిరెడ్డితో కలిసి జిల్లా వ్యవసాయాధికారి దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. అనంతరం సోదనపల్లి, ఆకులేడు గ్రామాల్లోనూ పంటలను పరిశీలించి, రైతులతో వివరాలు సేకరించారు. అనంతరం డీఏఓ మాట్లాడుతూ పంట నష్టపోయిన ప్రతి రైతునూ ఆదుకుంటామని, ఈ మేరకు ప్రభుత్వానికి నివేదికలు పంపుతామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో ఏఓ చిన్నమ్మ, ఏఈఓ అక్కమ్మ, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

- అలాగే బుక్కరాయసముద్రం మండలం పొదరాళ్ల, రేగడి కొత్తూరు గ్రామాల్లో వర్షాలకు దెబ్బతిన్న పంటలను డీఏఓ చంద్రానాయక్, మండల వ్యవసాయాధికారి శ్యాం సుందర్‌రెడ్డి, సర్పంచ్ ఎర్రిస్వామి పరిశీలించారు.

పెద్దవడుగూరు : రెండు రోజుల క్రితం కురిసిన భారీ వర్షానికి మండలవ్యాప్తంగా కొర్ర, జొన్న, మొక్కజొన్న, మిరప, వేరుశనగ, పంటలు సుమారుగా 500 ఎకరాల్లో దెబ్బతిన్నాయి. ఏఓ మల్లీశ్వరి సోమవారం ఆయా గ్రామాల్లో పర్యటించి దెబ్బతిన్న పంట వివరాలను సేకరించారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిహారం ఇప్పించేలా చూస్తామన్నారు.

పంట నష్టపోయిన ప్రతి రైతునూ ఆదుకుంటాం


దెబ్బతిన్న అరటి పంటను పరిశీలిస్తున్న ఆలూరు సాంబశివారెడ్డి

యల్లనూరు:(పుట్లూరు): గాలివాన, వడగండ్ల బీభత్సానికి పంట నష్టపోయిన ప్రతి రైతునూ ఆదుకుంటామని ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి భరోసా ఇచ్చారు. సోమవారం మద్దిపల్లి, మడుగుపల్లి, ఎల్లుట్ల, రంగరాజుకుంట, కుమ్మనమల, చెర్లోపల్లి తదితర గ్రామాల్లో ఆయన జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు ఈశ్వరరెడ్డి, ఎంపీపీ రాఘవరెడ్డిలో కలిసి దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. అనంతరం ప్రతి రైతుకు జరిగిన నష్టాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో చర్చించి పరిహారం ఇప్పించేందుకు కృషి చేస్తామన్నారు. క్షేత్రస్థాయిలో అధికారులు పర్యటించి రైతుకు జరిగిన నష్టంపై అంచనాలను తయారు చేసి ప్రభుత్వానికి పంపించాలని హెచ్ఓ ఫజులున్నీసాబేగంకు సూచించారు. సుమారు 3 వేల ఎకరాల్లో అరటి పంట నష్టం జరినట్లు అధికారుల అంచనా. మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ వెంకట్రామిరెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు రామసుబ్బారెడ్డి, సర్పంచులు ఓబులేసు, మహేశ్వరరెడ్డి, రామాంజులరెడ్డి, నాయకులు మడుగుపల్లి నాగేశ్వరరెడ్డి, దంతలపల్లి బాలవెంకటరెడ్డి, పెద్దిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నార్పల: వడగండ్ల వర్షానికి పంటలు నష్టపోయిన రైతులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన మద్దలపల్లి, నాయనపల్లి, కురగానపల్లి, వెంకటాంపల్లి, గడ్డంనాగేపల్లి, పుల్సలనూతల, నడిమిదొడ్డి, కర్ణపుడికిలో దెబ్బతిన పంట పొలాలను పరిశీలించారు. కర్ణపుడికి గ్రామంలో వడగండ్లు మీదపడి గాయపడిన నారాయణమ్మను పరామర్శించారు. రాష్ట్ర ఎంఎస్ఎంఈ డైరెక్టర్ నిట్టూరు రఘునాథ్‌రెడ్డి, అనంతపురం మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ నార్పల సత్యనారాయణరెడ్డి, ఎంపీపీ నాగేశ్వరావు, సొసైటీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి, వ్యవసాయ మండలి చైర్మన్ నాగలింగారెడ్డి, మిద్దెకుళ్లాయప్ప పాల్గొన్నారు.

సుంకం వసూలు వేలం మళ్లీ వాయిదా


వేలంపాటకు సంబంధించిన నిబంధనలను వివరిస్తున్న కమిషనర్ శేషన్న

గుంతకల్లుటౌన్: మున్సిపాల్టీ పరిధిలో దినసరి, వారపు కూరగాయల మార్కెట్, జంతు వధశాల, మాంసపు దుకాణాల నుంచి సుంకం వసూలు చేసుకునే హక్కును కల్పించేందుకు సోమవారం కౌన్సిల్ హాల్‌లో నిర్వహించిన వేలం పాట మళ్లీ వాయిదా పడింది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం సర్కారు వారి పాటను రూ.43.56 లక్షలకు నిర్ణయించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర నుంచి తాము వేలంపాట పాడితే తమకు గిట్టుబాటు కాదని, అప్పుల్లో కూరుకుపోతామని సర్కారు వారి పాట విలువను తగ్గించాలని కోరారు. ఇందుకు కమిషనర్ బండిశేషన్న, ఆర్ఓ నాసిర్‌హుసేన్ ససేమిరా అన్నారు. గతయేడాది కూరగాయల మార్కెట్ సుంకం వసూలు చేసుకునేందుకు నిర్వహించిన వేలంలో హెచ్చుపాటదారుడు రూ.43.36 లక్షలకు దక్కించుకున్నాడన్నారు. గడిచిన మూడేళ్ల సరాసరిని లెక్కించి సర్కారు వారి పాట విలువను నిర్ధారించామని, అంతేకంటే తగ్గించడానికి తమకు ఎటువంటి అధికారాల్లేవని, కోర్టు ఉత్తర్వులను ధిక్కరించేది లేదని తేల్చిచెప్పారు. దీంతో కాంట్రాక్టర్లు వేలంపాటను పాడకుండా బయటికివెళ్లిపోయారు. ఈవేలంపాటను తిరిగి మంగళవారం ఉదయం 11 గంటలకు కౌన్సిల్‌హాల్‌లో నిర్వహిస్తున్నామని, ఆసక్తి కలిగిన వారుంటే పాల్గొనాలని అధికారులు కోరారు. ఆర్ఐ ఎర్రిస్వామి, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

వేసవి దుక్కులు తప్పనిసరి

యాడికి: మండలంలోని రైతులు వేసవిలో తప్పనిసరిగా భూమిని దున్నాలని ఏఓ మహబూబ్ బాషా కోరారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. వేసవి దుక్కులతో పంట సాగు సమయంలో కలుపు బెడద తప్పుతుందని పేర్కొన్నారు. దుక్కిలో బయటపడిన పురుగులను సైతం పక్షులు తినడం వలన చీడపీడల బెడద కూడా కూడా తగ్గుతుందని తెలియజేశారు.

గ్రామ సచివాలయాల్లో ఆధార్ సేవలు


కల్లూరు గ్రామ సచివాలయంలో ఆధార్ సేవలు పరిశీలిస్తున్న ఎంపీడీఓ విజయభాస్కర్

గార్లదిన్నె: మండల వ్యాప్తంగా అన్ని గ్రామ సచివాలయాల్లో ఆధార్‌సేవలు అందిస్తున్నట్లు ఎంపీడీఓ విజయభాస్కర్ పేర్కొన్నారు. సోమవారం కల్లూరు గ్రామ సచివాలయంలో అందిస్తున్న ఆధార్‌సేవలను ఎంపీడీఓ పరిశీలించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల నుంచి 15 ఏళ్ల మధ్య పిల్లల ఆధార్ బయోమెట్రిక్ అప్‌డేట్, 2010 నుంచి 2016 మధ్యలో ఆధార్‌కార్డు తీసుకున్న వారికి అప్‌డేట్ చేస్తామన్నారు. అదేవిధంగా ఈనెల 27, 28, 29 తేదీల్లో కల్లూరు, ఇల్లూరు శిరివరం ప్రజలకు కల్లూరు గ్రామ సచివాలయం, ముకుందాపురం, కమలాపురం, కొప్పలకొండ, పెనకచెర్ల ప్రజలకు యర్రగుంట్ల గ్రామ సచివాలయాల్లో ఆధార్ సేవలు అందిస్తారన్నారు.

నూతన రంగాలపై అవగాహన పెంచుకోవాలి

- జేఎన్‌టీయూఏ వీసీ జనార్దన్


వీసీ రంగ జనార్దన్‌కు జ్ఞాపిక అందిస్తున్న రమేష్‌రెడ్డి తదితరులు

తాడిపత్రి: విద్యార్థులు నూతన రంగాలపై అవగాహన పెంచుకోవాలని జేఎన్‌టీయూఏ వైస్ ఛాన్సలర్ రంగ జనార్దన్ సూచించారు. సోమవారం వీరాపురం సమీపంలో ఉన్న తాడిపత్రి ఇంజనీరింగ్ కళాశాలలో టెక్ మహోత్సవ్–2023కు ఆయన హాజరై మాట్లాడారు. ఆర్టిఫీసియల్ ఇంటెలిజెన్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ వంటి వాటిపై పట్టు పెంచుకోవాలన్నారు. లక్ష్యాలను చేరుకునేందుకు విద్యార్థులు నిరంతరం శ్రమించాలన్నారు. కళాశాల చైర్మన్ కె.రమేష్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు విలువలను నేర్చుకోవాలన్నారు. తమ కళాశాల విద్యార్థులు చదువులోనే కాకుండా, ఇతర అన్ని విషయాలో ముందుంటున్నారన్నారు. కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ అశోక్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరిలో ఏదో ఒక ప్రతిభ దాగి ఉంటుందని, దాన్ని గుర్తించి అటువైపుగా అడుగులు వేయాలని విద్యార్థులకు సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఈవీ సుబ్బారెడ్డి కళాశాల ప్రత్యేకతలు, సాధించిన విజయాలు వివరించారు. ఇంజనీరింగ్ ఫలితాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ల్యాప్ ట్యాప్‌లు ప్రదానం చేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. డీఓఏ నటరాజేశ్వర్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ఎంసీ భానుప్రసాద్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీల ఆందోళన

సాక్షి నెట్‌వర్క్: అంగన్‌వాడీ సిబ్బంది అరెస్టులకు నిరసనగా సోమవారం అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నేతలు గుత్తి, గుంతకల్లు, తాడిపత్రి, పామిడి, పెద్దవడుగూరు, బుక్కరాయసముద్రం తహసీల్దార్ కార్యాలయ ఎదుట నిరసన తెలిపారు. అనంతరం డిమాండ్లతో కూడిన పత్రాలను తహసీల్దార్లకు సమర్పించారు. కార్యక్రమంలో అంగనవాడీ యూనియన్ నేతలతోపాటు సీఐటీయూ, సీపీఎం నేతలు పాల్గొన్నారు.

24 నుంచి నవమి వేడుకలు

తాడిపత్రి టౌన్ : స్థానిక మెయిన్ బజార్‌లోని ఆర్‌వీ స్వామి కల్యాణ మండపంలో ఈనెల 24 నుంచి 30 వరకు శ్రీరామ నవమి వేడుకలు నిర్వహించనున్నట్లు మండప అధ్యక్షుడు భూమా హరినారాయణ ఓ ప్రకటనలో తెలిపారు. తొలిరోజు సీతా సమేత కోదండరామస్వామి అలంకారం, 25న శ్రీనివాసస్వామి, 26న మోహిని, 27న వైకుంఠ రామస్వామి, 28న శ్రీకృష్ణ స్వామి, 29న సీతా స్వయంవర అలంకారంలో స్వామి దర్శనమిస్తారని పేర్కొన్నారు. అలాగే 30న సీతారాముల కల్యాణం జరగనున్నట్లు వివరించారు.

యాజమాన్య పద్ధతులు పాటించండి


దెబ్బతిన్న పంటను పరిశీలిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

బుక్కరాయసముద్రం: గాలివానకు దెబ్బతిన్న పంటల్లో రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు సూచించారు. సోమవారం వారు మండలంలో గాలివానకు దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మల్లేశ్వరి మాట్లాడుతూ ఈదురు గాలులు వడగండ్ల వానకు మామిడి సపోట, చీని, మునగ తదితర పంటలు దెబ్బతిన్నాయన్నారు. పిలకదశలో ఉన్న వరి పంటలో అగ్గి తెగులు రాకుండా కార్బండిజమ్, మాంకోజెబ్, 400 గ్రాములు పిచికారీ చేయాలన్నారు. ఉద్యాన పంటల్లో విరిగిన కొమ్మలను తీసివేసి వాటిని లీటరు నీటికి ఇమిడాక్లోప్రిడ్ పిచికారీ చేయాలని సూచించారు. ప్రస్తుతం మామిడి పంటలో తేనెమంచు పురుగు ఆశించే అవకాశం ఉందని, నివారణకు ఇమిడాక్లోప్రిడ్ పిచికారీ చేయాలన్నారు. పెరుగుతున్న ఉష్ణోగ్రతలకు మామిడిలో తామర పురుగు ఆశించే అవకాశం ఉందని, నివారణకు కార్బండజిమ్ 1 గ్రాము లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ రవి కిశోర్‌రెడ్డి, రేకులకుంట ఉద్యాన పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ దీప్తి, డాక్టర్ విమల తదతరులు పాల్గొన్నారు.

బాధితులకు పరిహారం అందేలా చూడండి


బాధితులతో మాట్లాడుతున్న కురుబ సంఘం నేతలు

బుక్కరాయసముద్రం: ఇటీవల చెదుల్ల గ్రామానికి చెందిన 300 గొర్రెలు నంద్యాల జిల్లా ఆళ్లగడ్డలో ఇటీవల వడగండ్ల వానకు మృతి చెందిన విషయం తెలిసిందే. ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ఏపీ ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి సూచనల మేరకు సోమవారం జిల్లా కురుబ సంఘం నేత బుల్లే నారాయణ స్వామి కురుబ సంఘం నాయకులతో కలసి ఆళ్లగడ్డకు వెళ్లి గొర్రెలకాపరులను పరామర్శించారు. అక్కడి రెవెన్యూ, పశు సంవర్ధక శాఖ అధికారులతో మాట్లాడారు. ప్రభుత్వం నుంచి పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. జిల్లా గొర్రెల మేకల ఫెడరేషన్ చైర్మన్ నరసింహా గౌడ్, నాయకులు గంజి అభిలాష్, డీలర్ కేశవయ్య, మంజునాథ్ తదతరులు పాల్గొన్నారు.

దొణరామేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు


అలంకరణలో దొణరామేశ్వర స్వామి

శింగనమల: మండలంలోని చిన్నజలాలపురం గ్రామ సమీపంలో నున్న కొండపైన వెలసిన దొణరామేశ్వర స్వామికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుభకృత నామ సంవత్సరం చివరి వారం నెల పూజ చేపట్టారు. కార్యక్రమంలో చిన్నజలాలపురం, నరసాపురం, శింగనమల, గురుగుంట్ల గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం

పామిడి: పామిడి ప్రభుత్వ టీసీ హైస్కూల్‌లో 2022–23కు సంబంధించి టెన్త్‌లో ప్రతిభ కనబర్చిన తొలి ముగ్గురు విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం అందించనున్నట్లు 1990–91 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు తెలిపారు. ఈమేరకు సోమవారం హెచ్ఎంకు తెలియజేశారు. లెక్కల్లో వందకు వంద మార్కులు సాధించిన విద్యార్థికి ఆర్ట్స్ కాలేజ్ ప్రొఫెసర్ శ్యామ్‌ప్రసాద్ నగదు ప్రోత్సాహకం ఇవ్వనున్నట్లు ప్రకటించారు.

అంటు వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య చర్యలు

గుంతకల్లు రూరల్: అయ్యవారుపల్లిలో అంటువ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక పారిశుధ్య చర్యలు చేపట్టారు. గ్రామంలో ఇటీవల డెంగీ కేసులు నమోదైన నేపథ్యంలో సోమవారం మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ రామచంద్ర నాయక్, మండల మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నవీన్‌కుమార్ బాబు, పంచాయతీ కార్యదర్శి గోవిందరెడ్డి, సర్పంచ్ వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో విస్తృతంగా పారిశుధ్య చర్యలు చేపట్టారు. డ్రైనేజీలు, నీరు నిల్వ ఉన్న ఇతర ప్రాంతాల్లో ద్రావణాన్ని చల్లారు. గ్రామంలో ఇంటింటికీ తిరిగి విషజ్వరాలపై అవగాహన కల్పిస్తూ, ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

పాఠశాల ఆవరణలో జూదం


ఎల్ఎం పాఠశాల ఆవరణలో జూదమాడుతున్న దృశ్యం

గుత్తి: పట్టణంలోని ఎంఎస్ ఫుట్‌బాల్ క్రీడామైదానంలోని ఎల్ఎం బాలుర పాఠశాల ఆవరణలో కొన్ని రోజులుగా జూదగాళ్లు యథేచ్ఛగా జూదాలు ఆడుతున్నారు. సాయంత్రం అయిందంటే జూదగాళ్లు గుంపులు, గుంపులుగా పాఠశాల ఆవరణలోకి చేరుకుని రాణీ పూలు, నక్కా ముష్టి వంటి జూదాలు ఆడుతున్నారు. జూదాల్లో ఓడిన వారు గొడవలకు దిగిన ఘటనలు కూడా చోటు చేసుకున్నాయి. ఏకంగా పాఠశాల ఆవరణలోనే జూదాలు ఆడుతున్నా పోలీసులు పట్టించుకోవడంలేదు. దీంతో జూదగాళ్లు ఆడింది పాట పాడింది పాట చందంగా తయ్యారైంది. ఇప్పటికైనా పోలీసులు స్పందించి పాఠశాల ఆవరణలో జూదాలు ఆడకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

ఆర్‌యూబీ నిర్మాణంపై సర్వే


రైల్వే ట్రాక్‌ను పరిశీలిస్తున్న మున్సిపల్, రైల్వే ఇంజినీరింగ్ అధికారులు

గుంతకల్లు: పట్టణంలోని ధర్మవరం రైల్వే గేట్ రోడ్డులోని లెవల్ క్రాసింగ్ స్థానంలో రోడ్డు అండర్ బ్రిడ్జి (ఆర్‌యూబీ) నిర్మాణానికి రైల్వే అధికారులు, మున్సిపల్ అధికారులతో కలిసి సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఆధ్వర్యంలో రైల్వే ఇంజినీరింగ్ స్టాఫ్‌తో కలిసి ధర్మవరం గేట్ వద్ద ప్రాంతాన్ని పరిశీలించారు. ఆర్‌యూబీ నిర్మించిన సమయంలో ఇరువైపులా రోడ్డును విస్తరింజేయడానికి ఇదివరకే మార్కులను ఏర్పాటు చేసినట్లు కమిషనర్ రైల్వే ఇంజనీరింగ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఆర్‌యూబీ 5 మీటర్ల పొడవు, 3.6 మీటర్ల ఎత్తులో రెండు వరుసల్లో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వంతెనలో వర్షపు నీరు మళ్లించే అంశంపై చర్చించారు. మున్సిపల్ డీఈ హేమచంద్ర, టీపీఓ మురళీ, రైల్వే ఇంజినీరింగ్ విభాగం అధికారులు పాల్గొన్నారు.